

# పుస్తక పరిచయం




**కరీంనగరవాసి, కవి, జాతీయ, అంతర్జాతీయ** సినిమారంగాల గురించి లోతైన అవగాహన, నిశిత పరిశీలన ఉన్న ప్రముఖులు వారాల ఆనంద్‌గారు వివిధ పత్రికల్లో వ్రాసిన వ్యాసాల సంకలనం ఈ పుస్తకం. ఇందులో తెలంగాణా సినిమా గురించిన వ్యాసాలు అధికంగా ఉన్నా - ఇరాన్ సినిమాలు, మరాఠీ సినిమాల గురించిన వ్యాసాలు కూడా ఉన్నాయి. తెలంగాణా సినిమాని పలుకోణాల్లో ఆనంద్‌గారు విశ్లేషించిన తీరు అభినందనీయం. ప్రతి వ్యాసం వెనుకా విశేషమైన కృషి, విశ్లేషణ ఉన్నాయి. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక తెలంగాణాలో చలనచిత్రపరిశ్రమ అభివృద్ధికోసం తీసుకోవాల్సిన చర్యలగురించి ప్రారంభ వ్యాసాల్లో (మన రాష్ట్రం మన సినిమా, తెలంగాణా సినిమా దశ దిశ, ఏది తెలంగాణా సినిమా) వివరించారు. వీరు సూచించిన అనేకకోణాలు అత్యంత ఆచరణీయాలుగా ఉన్నాయి. ఒకపరిశ్రమ గురించి లోతైన అధ్యయనం, పరిశోధన చేసి వ్రాసిన వ్యాసాలు - ఫిల్మ్ అకాడెమీ, ఫిల్మ్ డివిజన్, ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్, ఫిల్మ్ టూరిజం వ్యాసాలు. ప్రతివ్యాసంలోను రచయిత ఇచ్చిన ఉదాహరణలు, చరిత్ర నేర్పిన పాఠాలు, ప్రస్తుతం చేపట్టవలసిన అంశాలు, భవిష్యత్తు గురించిన ప్రణాళికలు చాలా ప్రాక్టికల్‌గా ఉన్నాయి. చిత్రపరిశ్రమలోని అన్నికోణాలను స్పృశించారు అనడానికి మరికొన్ని ఉదాహరణలు - షార్ట్ ఫిల్మ్ గురించిన -వీక్షించు నేర్చుకో నిర్మించు; సినీప్రదర్శనకు సంబంధించిన - ఊరారా మినీథియేటర్లు. బి.నరసింగరావు, పైడి జైరాజ్, బి.ఎస్.నారాయణ, టి.మాధవరావు, అజిత్‌ల గురించిన మోనోగ్రామ్స్ చాలా ఆసక్తిదాయకంగా ఉన్నాయి. కళాకారులూ కాపీరైట్ చట్టం అనే వ్యాసంలో ఒకగాయకుడికీ, సంగీతదర్శకుడికీ మధ్య జరిగిన వివాదం నేపథ్యంలో కాపీరైట్ చట్టాల గురించి, అవి అమలుజరుగుతున్న తీరుగురించి వివరంగా చెప్పారు. పుస్తకంలోని ప్రతివ్యాసంలోనూ రచయిత అవగాహనా విస్తృతి, విశ్లేషణా సామర్థ్యం కొట్టవచ్చినట్లు కనిపిస్తాయి. తెలంగాణా సినిమా గురించి ఇంత వివరణాత్మకమైన పుస్తకం ఇంతవరకూ రాలేదనడంలో అతిశయోక్తిలేదు. ఈ కృషిచేసిన వారాల ఆనంద్‌గారు అభినందనీయులు.

★★★

**For Copies:**
**V. INDIRA RANI**
H.No. 8-4-641, Hanuman Nagar
Karimnagar - 505 001.
TELANGANA.
Cell : 9440501281.
and
All leading Book Sellers




కొసరాజు కృష్ణప్రసాద్

Mobile: +1 7327818298, +91 77423777, +91 77424777

E-Mail: krishnaprasadk@gmail.com

ఈ శీర్షికలో తమ పుస్తక పరిచయాలు ప్రచురింపబడాలనుకునే వారు, తమ పుస్తకాలు ఒక్కొక్క కాపీని క్రింది ఎడ్రసుకి మెయిల్ చెయ్యవలసిందిగా 'కౌముది' విజ్ఞప్తి చేస్తోంది.

**Editor,**
**KOUMUDI (Web Monthly)**
**4251 - Escudo Ct**
**Dublin - CA 94568, USA**

**"తెలుగు సాహితీ సందరమున** జాలువాఱు ఒక నీటి బిందువునై.. నేను సైతం.." అన్న ప్రకటనావాక్యంతో ప్రారంభమైన ఈ అంతర్వాణి కవితా సంపుటి రచయిత కొసరాజు కృష్ణప్రసాద్‌గారు. ముందుమాటలో తనకు గల సాహిత్యాభిలాష గురించి, ఈ పుస్తకనేపథ్యం గురించి ఆసక్తికరమైన సమాచారాన్ని పాఠకులతో పంచుకున్నారు రచయిత "సాహిత్యం అంతర్వాణికి అక్షరరూపం, అంతరంగ భావనకు కలుగు హృదయ స్పందనకు ప్రతిరూపం." అని ప్రారంభమైన ముందుమాటలో "చిన్నప్పుడు 'కవితలు కావివి తవికలు' తో మొదలైంది నా సాహిత్య లేఖన ప్రస్థానం. కానీ ఎందుకనో, సాహిత్య లేఖనం మీద అప్పుడు మనసు లగ్నం కాలేదు" అంటూ సవివరంగా తన సాహితీప్రస్థానాన్ని వివరించారు కృష్ణప్రసాద్‌గారు. ఈ సంపుటికి వ్రాసిన తొలిపలుకులో ప్రముఖ కవి - కవి యాకూబ్‌గారు "కొసరాజు కృష్ణప్రసాద్ కవితా సంపుటి 'అంతర్వాణి' తెరవగానే ప్రాచీన కావ్యసంప్రదాయం కనపడడం ఒకింత ఆశ్చర్యాన్ని, సంతోషాన్ని కలిగించింది" అని ప్రారంభించి మంచి కవిత్వం గురించి ప్రముఖులు చేసిన వ్యాఖ్యలను గుర్తుచేస్తూ ఈ సంపుటిలోని కవితల మాధుర్యాన్ని వివరించారు. 50 పైగా కవితలున్న ఈ 'అంతర్వాణి' లోని కవితల్లో ప్రాచీన గ్రాంథిక శైలి స్పష్టంగా కనిపిస్తుంది. అంతర్లీనంగా సాగే లయాత్మక గుణం కూడా ఈ కవితల ప్రత్యేకత. ఏ ఆధునిక కవితా సంపుటాల్లోనూ కనిపించని లఘువివరణ, కొన్ని పదాలకు అర్థాలను పొందుపరచడం కూడా ఈ సంపుటి ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. మొట్టమొదటి కవిత 'మాతా పితః నమామి' లో 'ఏ రీతిన మిముదలచెద / ఋణముదీర్చ మిముగొలిచెద?/ మీ అనురాగపు అంశ నేనై / దినదినము పెరుగుచుండ / మమతల పల్లకిలోన / మురిపాలతో ముద్దు జేసి' అంటూ అమ్మానాన్నలను ప్రశంసించారు. ఈ కవిత చివరలో సంతసించు = సంతోషించు ; సదా = ఎల్లప్పుడు ; గురుకులము = విద్యాలయము .. లాంటి పదాలు - అర్థాలు కూడా జతచేశారు. కవితల్లో వస్తువైవిధ్యం విస్తృతంగా ఉంది. సాగుజీవి అనే కవితలో "నిండు వేసవిలోన మండుటెండను సైతం / పండు వెన్నెలగ తలచి పలుగుబట్టి" అంటూ సాగుజీవి గురించి తన పరిశీలనకు కవిత్వరూపం ఇచ్చారు. ఈ కవిత చివరలో కూడా స్వేదము = చెమట లాంటి ప్రతిపదార్థం కూడా ఉంది. ఆధునిక కవితారంగంలో ఈ అంతర్వాణి ఒకప్రత్యేకత కలిగిన కవితాసంపుటి అని చెప్పడంలో అతిశయోక్తిలేదు.

★★★